# రైతన్నల కల్పతరువు.. పెద్దపేట చెరువు

## మిషన్ కాకతీయతో మారిన రూపురేఖలు

- యాసంగిలోనూ 400 ఎకరాలకు సాగు నీరు
- 300 మత్స్యకార కుటుంబాలకు ఉపాధి


ఆయకట్టు కింద పొలాలు

దండేపల్లి, డిసెంబర్17 : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పాలకులు చెరువులపై దృష్టి సారించకపోవడంతో పెద్దపేట చెరువు ఆయకట్టు క్రమంగా తగ్గుతూ వచ్చింది. కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మిషన్ కాకతీయతో చెరువు రూపురేఖలు మారిపోయాయి. మొదటి విడుతలో(2015) భాగంగా రూ.34 లక్షలతో పూడిక తీసి కట్ట బలోపేతం, పొలాలకు వెళ్లే కాలువలకు మరమ్మతులు చేశారు. రెండో విడుతలో తూములు శిథిలావస్థకు చేరుకోగా వాటి స్థానంలో కొత్తవి నిర్మించారు. దీంతో నీటి నిల్వ సామర్థ్యం పెరిగి ఆయకట్టు పెరిగింది. మూడో విడుతలో రూ.8 లక్షలతో కట్ట బలోపేతం చేశారు. దీంతో చెరువు దశ తిరిగింది. చెరువుల్లో జలకళ ఉట్టి పడుతుండడంతో ఉన్న బావుల్లో నిండా నీరు ఉంటుం ది. ఈ బావులకు మోటర్లు అమర్చుకొని యాసంగి వరి, మక్క పండిస్తున్నారు. ఖరీఫ్‌లో ఏ మాత్రం తీసిపోకుండా యాసంగిలో సాగు చేస్తున్నారు.

### మత్స్యకార కుటుంబాలకు ఉపాధి

పెద్దపేట చెరువు వ్యవసాయ అవసరాలకే కాక అనుబంధ రంగాలైన మత్స్య పరిశ్రమకు ప్రధాన ఆదరువుగా నిలుస్తోంది. చెరువుల్లో జలసిరి ఉంటేనే చేపల పెంపకానికి అవకాశం ఉంటోంది. మంచిర్యాల జిల్లాలోనే పెద్ద చెరువుల్లో ఒకటైన పెద్దపేట చెరువుపై ఆధారపడి 250 నుంచి 300 మత్స్యకార కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఈ చెరువులో ప్రతి యేటా రూ.10 లక్షల విలువైన చేపలు పడుతున్నారు. మంచిర్యాల, జగిత్యాల, కరీంనగర్ లాంటి పెద్ద మార్కెట్‌కు తరలించి ఆర్థికంగా జీవనోపాధి పొందుతున్నారు. సంప్రదాయ రకాలైన కొర్రమీన, మట్ట, జెల్ల, చందమామ, పరక, పచ్చిరొయ్య విస్తృతంగా పండిస్తున్నారు. మళ్లీ పూర్వవైభవం వచ్చిందని మత్స్యకారులు సంబుర పడుతున్నారు.


చెరువులో చేపలు పడుతున్న మత్స్యకారులు(ఫైల్)

### ❖ సాగునీటికి ఇబ్బంది లేదు..



మాది లక్ష్మీకాంతాపూర్ గ్రామం. నాకు పెద్దపేట శివారులో ఎకరం పొలం ఉంది. నేను ఈసారి వరి వేశా. చెరువు కిందనే పొలం ఉండడంతో ఏనాడు సాగు నీటి కోసం ఇబ్బంది పడలేదు. గతంలో చుట్టూ పక్కల గ్రామాల్లో నీరు లేక పొలాలు ఎండిన రోజుల్లోనూ మేము పంటలు పండించుకుంటున్నాం. సర్కారు మిషన్ కాకతీయతో చెరువును బాగు చేసింది. చెరువు మమ్మల్ని అన్ని విధాలుగా ఆదుకుంటుంది. యేటా ఈ చెరువుతో రెండు పంటలు పండించుకుంటున్నాం.

**- బాదినేని శంకరయ్య, రైతు, లక్ష్మీకాంతాపూర్, దండేపల్లి మండలం**

### ❖ రెండు పంటలు వేస్తున్నా..



మాది పెద్దపేట గ్రామం. చెరువు ఆయకట్టు కింద నాలుగెకరాల పొలం ఉంది. యాసంగిలో నాలుగెకరాల్లో మక్క సాగు చేసిన. చెరువు కిందనే పొలం ఉండడంతో సాగు నీటికి ఇబ్బంది లేకుండా సాగు చేసుకుంటున్న. తెలంగాణ సర్కారు హయాంలోనే చెరువు బాగైంది. ఈ చెరువుతోనే మా కుటుంబం సంతోషంగా ఉంది. రెండు పంటలు పండించుకుంటున్నా. **- ఆగిడి తిరుపతి, రైతు, పెద్దపేట.**

### ❖ బావిలో నీళ్లు పుష్కలంగా ఉంటున్నాయి..



మాది లక్ష్మీకాంతాపూర్ గ్రామం. నాకు పెద్దపేట శివారులో మూడెకరాల పొలం ఉంది. ఇప్పుడు ఒక ఎకరం వరి, ఎకరం పత్తి, ఎకరం మక్క సాగు చేస్తున్నా. చెరువు చేయబట్టి బావుల్లో నీళ్లు పుష్కలంగా ఉంటున్నయ్. అప్పటి సర్కారు రైతుల కొరకు ఆలోచించి చెరువు బాగు చేసింది. చెరువుతోని పంచాయతీకి ఆదాయం వచ్చుడే కాక రైతుల జీవితాల్లో మార్పు తెచ్చింది. రంది లేకుండా రెండు పంటలు పండించుకుంటున్నా. **- పసర్తి తిరుపతి, రైతు, లక్ష్మీకాంతాపూర్, దండేపల్లి మండలం.**


సారంగాపూర్ మండలం బీరవెల్లిలో ఏర్పాటు చేసిన ఆయిల్ పామ్ నర్సరీ వద్ద వెంకట్‌రాంరెడ్డి

- ఈ దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతలను ప్రోత్సహించాలి
- నూనెగింజల సాగుతోనే దీర్ఘకాలిక ప్రయోజనం
- 4 ఏళ్ల నుంచి 30 ఏళ్ల వరకు నిరంతర ఆదాయం
- ఉద్యానవన శాఖ రాష్ట్ర మాజీ కమిషనర్ వెంకట్‌రాంరెడ్డి

# ఆయిల్ పామ్ సాగును ఉద్యమంలా చేపట్టాలి..

## కేసీఆర్ ప్రభుత్వం రైతులను అన్ని విధాలా అండగా నిలిచింది..

నిర్మల్, డిసెంబర్ 17(నమస్తే తెలంగాణ) : 'మన దేశంలో 1947 స్వాతంత్ర్యం రాక ముందు ఒక వ్యక్తి ఏడాదికి దాదాపు 3-4 కేజీల వంట నూనె వినియోగించేవారు. అది ఇప్పుడు 20 కేజీలకు చేరుకోవడంతో దేశవ్యాప్తంగా ఉన్న 140 కోట్ల మంది ప్రజలు ఏటా 22 నుంచి 23 మిలియన్ మెట్రిక్ టన్నుల నూనెను వినియోగిస్తున్నట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. గత ఐదారేళ్లుగా ఈ లెక్కలను పరిగణలోకి తీసుకుంటే 140 కోట్ల మందికి సరిపడా నూనెల కోసం 50 నుంచి 80 వేల కోట్ల రూపాయల విదేశీ మారక ద్రవ్యాన్ని వెచ్చించి ఇండోనేషియా, మలేషియా లాంటి దేశాల నుంచి పామాయిల్‌ను దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. స్నాక్స్ ఫుడ్ కల్చర్‌కి పామాయిలే ప్రత్యామ్నాయంగా మారడంతో ఆయిల్ పామ్ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా విపరీతంగా డిమాండ్ ఏర్పడింది.' అని రాష్ట్ర ఉద్యానవన శాఖ మాజీ కమిషనర్ లోక వెంకట్‌రాంరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయిల్ పామ్ సాగు గురించి వివరించారు.

### కేసీఆర్ ప్రభుత్వంలో అధిక ప్రాధాన్యత

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం పామాయిల్ తోటల పెంపకానికి అధిక ప్రాధాన్యతనిచ్చిందన్నారు. రాష్ట్రంలో 27 నుంచి 30 లక్షల వరకు బోరుబావులు ఉండడంతో వాటి కింద 50 నుంచి 60 లక్షల ఎకరాలకు ఏడాది పొడవునా సాగు నీరందించే అవకాశం ఉండడం ఆయిల్‌పామ్ సాగుకు వరంలా మారిందని పేర్కొన్నారు. అలాగే 24 గంటల ఉచిత కరెంటు ఇవ్వడం, పామాయిల్ సాగుకు ఇక్కడి భూములు అనుకూలమని గుర్తించిన ప్రభుత్వం ఆ దిశగా రైతులను ప్రోత్సహించిందని గుర్తు చేశారు. నాలుగైదేళ్లలో 20 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. గతేడాది రాష్ట్ర వ్యాప్తంగా 2022-23 సంవత్సరంలో దాదాపు 84 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 13 కంపెనీలు, 36 నర్సరీలను ఏర్పాటు చేసి, లక్షల మొక్కలను రైతులకు అందుబాటులో ఉంచాయన్నారు. ఏటా 30-40 లక్షల మొక్కలను అందుబాటులోకి తేవాలన్న లక్ష్యంతో ఆయా కంపెనీలు.. అవసరమైన సీడ్ మెటీరియల్‌ను ఇండోనేషియా, థాయిలాండ్, మలేషియా, కోస్టారికా దేశాల నుంచి తీసుకొచ్చి 12 నెలలపాటు ఇక్కడి నర్సరీల్లో పెంచి రైతులకు పంపిణీ చేస్తున్నాయని తెలిపారు. మొక్క నాటిన నాటి నుంచి దిగుబడి ప్రారంభమయ్యే వరకు 4 ఏళ్ల పాటు ఎకరానికి రూ.50 వేల వరకు సబ్సిడీ ఇచ్చి కేసీఆర్ ప్రభుత్వం రైతులను ఎంతో ప్రోత్సహించడం వల్లనే రైతులు ముందుకు వచ్చారన్నారు.

### అంతర పంటలతో ఆదాయం..

ఒక టన్నుకు రూ.15 వేల మద్దతు ధరను కేంద్ర ప్రభుత్వం కల్పించే అవకాశాలు ఉన్నాయని, పర్యావరణానికి ఈ ఆయిల్ పామ్ పంట మంచిదన్నారు. ఒక ఎకరంలో నాటిన ఆయిల్ పామ్ చెట్లు ఏడాదికి 17-18 మెట్రిక్ టన్నుల కార్బన్ డై ఆక్సైడ్‌ను తీసుకొని 12-13 మెట్రిక్ టన్నుల ఆక్సిజన్‌ను విడుదల చేసే ఏకైక పంట ఇదే అన్నారు. ఆక్సిజన్ పరంగా ఐదెకరాల దట్టమైన అడవి కంటే ఒక ఎకరం ఆయిల్ పామ్ పంట సమానమన్నారు. ప్రతి పక్షం రోజులకోసారి ఈ ఆయిల్‌పామ్ గెలలు రావడం వల్ల రైతుకు నిరంతర ఆదాయం చేకూరుతుందని తెలిపారు. ఎకరం వరి పంటకు అవసరమైన నీటితో దాదాపు ఐదెకరాల ఆయిల్ పామ్ తోటను సాగు చేయవచ్చని, దీంతో సాగునీటిని, కరెంటును ఆదా చేయవచ్చన్నారు. అలాగే సాధారణ పంటలకు జరిగే నష్టం ఈ ఆయిల్‌పామ్‌కు ఉండదన్నారు. కోతులు, అడవిపందుల బెడద, రాళ్ల వాన, దొంగల బెడద ఉండదు కాబట్టి ఇది రైతులకు ఎంతో అనువైన పంట అన్నారు. మొక్కలు నాటిన నాటిన నుంచి మూడేళ్ల వరకు పసుపు, పత్తి, వేరుశనగ, నువ్వు, సోయా, శనగ, మక్క, కూరగాయల వంటి అంతర పంటలను వేసుకోవచ్చని తెలిపారు. అలాగే తోటల చుట్టూ గట్లపై టిష్యూ కల్చర్ టేకు, శ్రీగంధం చెట్లు, జామ, సీతాఫల్, మామిడి చెట్లను పెంచుకోవడం ద్వారా రైతులు అదనపు ఆదాయాన్ని పొందవచ్చన్నారు. రైతులు నూతన పంథాలో ఆలోచన చేసి అనాదిగా వస్తున్న సంప్రదాయ పంటలకు భిన్నంగా వాణిజ్య పంట అయిన ఆయిల్ పామ్‌ను సాగు చేస్తే 30 ఏళ్లపాటు నిరంతరాయంగా ఆదాయం పొందవచ్చన్నారు. యువతరం స్మార్ట్ వ్యవసాయం దిశగా ఆలోచిస్తున్నారని, అలాంటి వారితోపాటు, రాష్ట్ర రైతాంగం పెద్ద మొత్తంలో ఆయిల్ పామ్ సాగు చేసి మంచి ఉపాధి పొందాలని సూచించారు.

### ప్రీ-యూనిక్ కంపెనీ ఆధ్వర్యంలో..

నిర్మల్ ప్రాంతంలో ప్రీ-యూనిక్ అనే మలేషియాకు చెందిన కంపెనీకి ఏడు జిల్లాలను కేటాయించారని, వీటిలో నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్, సిరిసిల్ల, నాగర్‌కర్నూల్, వనపర్తి, మహబూబ్‌నగర్ జిల్లాలు ఉన్నాయన్నారు. ఈ కంపెనీ ఆధ్వర్యంలో ఇండోనేషియా, మలేషియా తదితర దేశాల్లో లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ తోటలను సాగు చేస్తున్నారన్నారు. ప్రీ-యూనిక్ కంపెనీకి ఉన్న సుదీర్ఘ అనుభవంతో ఆయా దేశాల్లోని నర్సరీల్లో టొపాజ్ అనే మంచిరకం మొక్కలను ఉత్పత్తి చేసి ఈ ప్రాంత రైతులకు అందుబాటులోకి తేవడం శుభ పరిణామమన్నారు. నిర్మల్ జిల్లాలోని బీరవెల్లి నర్సరీలో ఈ టొపాజ్ రకం ఆయిల్‌పామ్ మొక్కలు రైతులకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఈ రకం మొక్కలను దాదాపు 6 వేల ఎకరాల్లో నాటడం జరిగిందని, మరో 4 వేల ఎకరాల్లో సాగు చేసేందుకు అవసరమైన మొక్కలు సిద్ధంగా ఉన్నాయన్నారు.

### లక్ష్యం మేరకు ఆయిల్‌పామ్ సాగు చేపట్టాలి..

గతేడాది రాష్ట్ర వ్యాప్తంగా 4 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు జరిగేలా చూడాలని కేసీఆర్ ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. ఆయిల్‌పామ్ సాగుకు ముందుకొచ్చే రైతులకు అనేక ప్రోత్సాహకాలు అందజేసింది. అయితే ఈ పంటపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన లేకపోవడం వల్ల చాలా మంది ముందుకు రాలేదన్నారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది కృషితో 25 శాతం లక్ష్యాన్ని చేరుకోగలిగామన్నారు. అయితే కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఇక్కడి రైతులు ఆయిల్‌పామ్ సాగు చేసేలా ప్రోత్సహించాలన్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను పండించాలని గత కేసీఆర్ ప్రభుత్వం రైతులను ఏ విధంగానైతే ప్రోత్సహించిందో అదే విధంగా కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ముందుకు వెళ్లాలని కోరారు. అంతేకాకుండా ఒక స్పెషల్ ఆఫీసర్‌ను నియమించి వచ్చే నాలుగేళ్లపాటు ఆయిల్‌పామ్ సాగును పర్యవేక్షించేలా చేస్తే ఈ ప్రాంత రైతులకు మేలు జరిగి తెలంగాణ ఒక సుసంపన్న రాష్ట్రంగా అవతరిస్తుందన్నారు. పర్యావరణ పరంగా ఈ పంట ఎంతో మంచిది కావడంతో ప్రపంచంలోనే తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు వస్తుందన్నారు.


కెరమెరిలో సాగు చేస్తున్న అరటితోట

# ఉద్యాన వనాలకు ప్రోత్సాహం

## పండ్ల తోటల పెంపకానికి సాయం

- ఇప్పటికే 1520 ఎకరాల్లో సాగు
- ఈ యేడాది 85 ఎకరాలకు పైగా పెంచేందుకు ప్రణాళికలు
- అరటి, బొప్పాయి, మామిడి, జామ, పనస, ఆయిల్ పామ్ విస్తరించాలని లక్ష్యం
- ఆసక్తి చూపే రైతులకు రాయితీలు

కుమ్రం భీం ఆసిఫాబాద్, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో సమీకృత వ్యవసాయ విధానాలతో రైతులకు నిరంతర ఆదాయం అందించేందుకు ఉద్యానవనశాఖ చర్యలు పడుతోంది. యేటా మామిడి, అరటి వంటి తోటలను విస్తరిస్తున్నారు. దీనికి తోడు ఈ యేడాది పనస, జామ, బొప్పాయి(పొప్పడి) పంటలు కూడా వేయించేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. 2023 ఆర్థిక సంవత్సరంలో పన్నెండున్నర ఎకరాల్లో అరటి, రెండున్నరెకరాల్లో బొప్పాయి, పన్నెండున్నర ఎకరాల్లో మామిడి, 10 ఎకరాల్లో జామ, 25 ఎకరాల్లో పనస తోటలను విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మేరకు ఆసక్తి ఉన్న రైతులను ఎంపిక చేస్తున్నారు. ఇక సుమారు 20 ఎకరాల్లో ఇతర పండ్ల తోటలు పెంచనున్నారు.


### ఇప్పటికే 1520 ఎకరాల్లో..

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఇప్పటికే 1520 ఎకరాల్లో మామిడి, ఆపిల్, ఆపిల్‌బేర్, అరటి, దానిమ్మ, పుచ్చ తదితర తోటలు వేశారు. వాణిజ్య పంటల వలన పెట్టుబడి భారం పెరుగుతుండడంతో ఉద్యానవనశాఖ పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తోంది. క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తూ పండ్లతోటలను సాగుచేసే విధంగా చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో గతేడాది 122 ఎకరాలకు పైగా పండ్ల తోటలు సాగు చేసుకున్న రైతులకు రాయితీలను (ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ. లక్షకు 90 శాతం రాయితీ.. మిగతా రైతులకు 40 శాతానికి పైగా రాయితీ) ప్రోత్సాహకంగా అందించారు. వీటితో రైతులు పండ్లమొక్కల సంరక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. ఈ సంవత్సరం పండ్లతోటలను 80 ఎకరాలకు పైగా విస్తరించాలని అధికారులు భావిస్తున్నారు. అలాగే 1466 ఎకరాల్లో ఆయిల్ పామ్ తోటలను విస్తరించేలా చర్యలు తీసకుంటున్నారు.

### తోటల పెంపకానికి రాయితీలు

ఆసిఫాబాద్ జిల్లాలోని రెబ్బెన, సిర్పూర్-టీ, దహెగాం, కెరమెరి, తిర్యాణి మండలాల్లో రైతులు ఎక్కువగా పండ్లతోటలవైపు ఆసక్తి చూపిస్తున్నారు. పండ్లతోటల పెంపకానికి ముందుకు వచ్చే రైతులకు ఉద్యానవన శాఖ మూడేళ్ల వరకు రాయితీ అందించనున్నది. మామిడి సాగుచేసే రైతులకు ఎకరానికి రూ. 58,452, జామకు రూ. 76,112, సంత్ర సాగుకు రూ. 76,071, దానిమ్మ సాగుకు రూ. 91,474, బత్తాయి సాగుకు రూ. 69,547, సీతాఫలానికి రూ. లక్ష, సపోటకు రూ. 49,551, నేరేడుకు రూ. 31,719లను సంబంధిత శాఖ మూడేళ్ల వరకు రాయితీ అందిస్తుంది. సూక్ష్మసేద్య పథకం ద్వారా జిల్లాలో ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం రాయితీపై సేద్యపు పరికరాలను కూడా అందించేందుకు చర్యలు చేపట్టింది. మరోవైపు పండ్లతోటల పెంపకంతో పాటు అటవీ జాతి మొక్కల పెంపకంపై ఆసక్తి ఉన్న రైతుల కూడా రాయితీలు ఇస్తున్నది.


పోట్లాడుకుంటున్న దుప్పులు


ఒడిలో బిడ్డతో సేదతీరుతున్న కొండెంగ


కొండెంగ లొద్ది జలపాతం

# ప్రకృతి సోయగం

## ఉత్తర భారతదేశంలోనే పెంచికల్‌పేట్ రేంజ్ అద్భుతమైన ప్రదేశం

- అందమైన అడవి పుష్పాలు, మనోహరమైన దృశ్యాలకు ఆలవాలం
- ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటున్న జలపాతాలు

పెంచికల్‌పేట్, డిసెంబర్ 17 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ అటవీ డివిజన్‌లోని పెంచికల్‌పేట్ రేంజ్ ఉత్తర భారతదేశంలోనే పేరుపొందిన ప్రాంతం. ఈ ఏరియా విభిన్న మొక్కల పెంపకానికి, వన్యప్రాణుల సంతతికి పెట్టింది పేరు. పెంచికల్‌పేట్ అటవీ క్షేత్రం పక్కల ప్రాణహిత, పెద్దవాగులు ఉంటాయి. వీటి సంగమమే పాలరాపు గుట్ట. ఇక్కడ నీటి వనరులు సమృద్ధిగా ఉండడంతో వన్యప్రాణులు స్థిర నివాసం ఏర్పరచుకొని సంతతిని పెంపొందించుకుంటున్నాయి. ప్రధానంగా నెమళ్లు, ఎలుగుబంట్లు, కుందేళ్లు, కొండెంగలు, కోతులు, దుప్పులు, కొండగొర్రెలు, అడవి దున్నలు, తోడేళ్లు, పులుల సంఖ్య భారీగా పెరుగుతోంది. వలస పక్షులు కూడా వస్తుండడంతో ఈ ప్రాంతం నిత్యం సందడిగా మారుతోంది. వర్షాకాలంలో దుద్దులాయి, కొండెంగ లొద్ది జలపాతాలు తెల్లని పాలనూరుగ ధారలతో ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా ఏపుగా, లావుగా పెరిగిన పసుపు కడిమి వృక్షాలు కనిపిస్తాయి. గుండెపల్లి బేస్‌క్యాంప్, గడ్డి మైదానాలు, ఊట కుంటలు, సహజ వనరులు, అందమైన అటవీ పుష్పాలు ఉంటాయి. అటవీ, వన్య ప్రాణులను వేటగాళ్ల నుంచి రక్షించేందుకు ప్రత్యేక సీసీ కెమెరాలు, బృందాల ద్వారా నిత్యం పర్యవేక్షిస్తున్నామని పెంచికల్‌పేట్ ఎఫ్ఆర్‌వో వేణుగోపాల్ తెలిపారు.


ఏపుగా పెరిగిన పసుపు కడిమి వృక్షాలు


రాపు ప్రాంతంలో కుందేలు


ఇక్సర అరేబియా రూబియాసే ఫ్యామిలీకి చెందిన మొక్క


అటవీ మల్లె లీనా పూలు


బర్లిరియా ఫ్లవర్